క్లుప్తంగా

ఘనంగా ఆరాధన మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని పాత రాఘవేంద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి ఆరాధనా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామివారి బృందావనానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా వివిధ రకాల పూలు, వెండి కవచాలతో అలంకరించారు. అలాగే గోపాల కృష్ణునికి పంచామృతాభిషేకం చేసి విశేష అలంకరణ చేశారు. భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సైంటిఫిక్ మేధస్సు దినోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం 7వ జాతీయ సైన్స్ మేధస్సు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాస్త్రవేత్త టి.చిన్నమునిస్వామి నాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ పాల్గొని విద్యార్థులకు సైన్స్ మేధస్సు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మూఢనమ్మకాల నిర్మూలన చట్టం కోసం కృషి చేసిన నరేంద్ర దబోల్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె, ముద్దంవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. 500 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సూడి పశువులకు, పాలు ఇచ్చే పశువులకూ తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. కొంత మంది రైతులు పాలు తగ్గుతాయని టీకాలు వేయించడం లేదని, అలాంటి అపోహలు లేకుండా టీకాలు వేయించాలన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు 105 డిగ్రీల జ్వరం, నోటి నుంచి సొంగ కారుస్తూ నాలుక, చిగుళ్లకు పుండ్లు ఏర్పడి గిట్టలకు గాయాలు ఏర్పడి కుంటుతూ పశువు తన ఉత్పాదకతను, పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోతాయని అన్నారు. కొన్నిసార్లు మరణం సంభవించవచ్చని తెలిపారు. అన్ని పశువులకు టీకాలు తప్పకుండా వేయించుకోవాలని కోరారు. ఈ రోజు నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

పిల్లలు బాలకార్మికులుగా ఉండకూడదు

బి.కోడూరు : బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, బాలకార్మికులు కాకూడదని మండల విద్యాశాఖాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తుమ్మలపల్లె ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు తదితర ప్రాంతాల నుంచి వలస కూలీలుగా వచ్చిన వారికి చెందిన నలుగురు పిల్లలు వ్యవసాయ పనులు చేస్తున్న విషయాన్ని గమనించి వారి కుటుంబ సభ్యులతో చర్చించి వారిని అప్పటికప్పుడు పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ విద్యతోనే నాగరికత పెంపొందడంతోపాటు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోపాటు నాణ్యమైన భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగును ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎన్.నజీంబాషా, ఉపాధ్యాయుడు వెంకటరమణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో బలవంతపు రాజీనామాలు

కలసపాడు : రేషన్‌షాపు డీలర్లతో అధికారపార్టీ నాయకులు అధికారులతో చెప్పించి బలవంతంగా రాజీనామాలు చేయాలని రేషన్‌షాపు డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. మండలంలో 17 రేషన్‌షాపులు ఉన్నాయి. అందులో 12 షాపులు లైసెన్స్ కలిగిన దుకాణాలు ఉన్నాయి. 5 రేషన్‌షాపులు స్వయం సహాయక సంఘాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే రెవెన్యూ అధికారులు సోమవారం శంఖవరం, చెన్నుపల్లె, తంబళ్లపల్లె రేషన్ డీలర్లతో బలవంతంగా రాజీనామా చేయించారు. మంగళవారం కలసపాడు రేషన్‌షాపు నెం. 7, పిడుగుపల్లె డీలర్లపై తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్‌ఓలు కలిసి డీలర్ల ఇంటి వద్దకు వెళ్లి రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. అయితే ఆ డీలర్లు తలొగ్గలేదు. వీరికి నాలుగు నెలల నుంచి కమిషన్ దాదాపు రూ.1.50 లక్షలకు పైగా ఇవ్వాల్సి ఉంది. అధికారులు కమీషన్ గురించి పట్టించుకోకుండా డీలర్ల వద్ద ఈ - పాస్ మిషన్లను స్వాధీనపరుచుకోవాలని డీలర్లపై ఒత్తిడి తెచ్చారు. భవిష్యత్తులో మీరు చాలా ఇబ్బందులు పడతారని, ముందుగానే వైదొలిగితే బాగుంటుందని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దారు మహబూబ్‌బాషాను వివరణ కోరగా మేము ఏ డీలర్ వద్దకు వెళ్లి బలవంతంగా రాజీనామా చేయాలని కోరలేదంటూ సమాధానం ఇచ్చారు.

వెల్లువెత్తిన నిరసన



ప్రొద్దుటూరులో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న ప్రముఖులు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు

కోల్‌కతా ఘటనపై కొనసాగుతున్న ఆందోళనలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో ఆర్‌జీ వికార్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థినిపై అత్యాచారం, హత్య సంఘటనపై నిరసన వెల్లువెత్తింది. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. స్థానిక శివాలయం సర్కిల్‌లో అధికారులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీవీ జయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, డాక్టర్లు నాగార్జున, కల్లూరు ప్రదీప్‌రెడ్డి, పద్మలత, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతా సుదర్శన్‌రెడ్డి, సెక్రటరీ ఖాసీం, న్యాయవాదులు గొర్రె శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, శివజ్యోతి, జింకా విజయలక్ష్మి, మెహతాబ్, టీడీపీ నాయకుడు చల్లా రాజగోపాల్, బీజేపీ, అనుబంధ సంస్థల ప్రతినిధులు, జనసేన, కాటన్ మర్చంట్స్, రైస్ మర్చంట్స్ అసోసియేషన్ల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్, లోకాసమస్త హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు, మెప్మా, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెడికల్ హోల్‌సేల్ రీటైల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎస్‌వీడీసీ, సీబీఐటీ విద్యార్థులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రొద్దుటూరు క్రైం : ట్రైనీ డాక్టర్‌ను అమానుషంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. కోర్టు కాంప్లెక్స్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ముడిమెల కొండారెడ్డి, మల్లెల లక్ష్మీ ప్రసన్న, జింకా విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

మైదుకూరు : కోల్‌కతాలో శిక్షణ పొందుతున్న డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ మంగళవారం సాయంత్రం మైదుకూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు, ఆయన కుమార్తె డాక్టర్ శృతి ఆధ్వర్యంలో పలువురు వైద్యులు, విద్యాసంస్థల యజమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని హత్యాచార దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి రాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రాఘవయ్య, బీజేపీ మైదుకూరు, ఖాజీపేట మండలాల అధ్యక్షులు ఆర్.రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, మృదంగం కిశోర్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, బ్లూబెల్స్ హైస్కూల్ యజమాని కేశవ, ఉదయ్, నాగేశ్వర్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు


మైదుకూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఎన్ని సార్లు చెప్పినా మారరా..?

- సబ్ రిజిస్టర్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం
- కార్యాలయాన్ని తనిఖీ చేసిన వరదరాజులరెడ్డి


సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో కూడా ఆయన ఇక్కడికి వచ్చి అధికారులను మందలించారు. ఇకపై లంచాలు తీసుకోబోమని వారితో ప్రమాణం కూడా చేయించారు. ఈ క్రమంలో మళ్లీ ఎమ్మెల్యే రిజిస్టర్ ఆఫీసుకు వెళ్లి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు చెప్పినా మీలో మార్పు రాదా అంటూ మండిపడ్డారు. లంచగొండి అధికారులు సెలవుపై వెళ్లాలని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్ డీఐజీతో ఫోన్లో మాట్లాడారు. వ్యాపార కేంద్రమైన ప్రొద్దుటూరులో ప్రతి రోజు ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయని చెప్పారు. ఏడాదికి రూ.వేల కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా ఇలాంటి చోట నిజాయితీ కలిగిన, మంచి అధికారులను నియమించాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తులతోపాటు కార్యాలయంలో పని చేసే కొందరు వ్యక్తులు డబ్బు వసూలు చేసి అధికారులకు ఇస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఉదయం 10.45 గంటలైనా చాలా మంది కార్యాలయానికి రాలేదని, వీళ్లు ఆఫీసును తమ సొంత ఎస్టేట్‌లా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మీనాపురం, కొత్తపల్లెలో ఎక్కువగా దొంగ రిజిస్టర్లు జరిగినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఉద్యమం



మాట్లాడుతున్న సీసీఎస్ బోర్డు మెంబర్ శ్రీనివాసరాజు

ప్రొద్దుటూరు : ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీసీఎస్ బోర్డు మెంబర్ శ్రీనివాసరాజు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న బీజీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిపోలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, రీజినల్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ రీజియన్ వ్యాప్తంగా ఎన్‌ఓలు కలపడం లేదని, 2019 సర్క్యులర్‌ను అమలు చేయకపోవడంతోపాటు ఏఏఎస్ ఇంక్రిమెంట్‌ను కలపడం లేదన్నారు. అలాగే కడప డిపోలో కండక్టర్, డ్రైవర్లకు ఫిక్స్‌డ్ చార్ట్‌లు వేయడం లేదన్నారు. ఇలా అనేక సమస్యలపై మెమోరాండం ఇచ్చినా సంబంధిత అధికారులు కనీసం చర్చలకు కూడా పిలవడం లేదన్నారు. ఈ కారణంగానే రీజియన్ వ్యాప్తంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి పి.సుధాకర్, యూనియన్ నాయకులు పి.భానుప్రసాద్, టీఆర్‌జీ రెడ్డి, పీవీసీఎం రెడ్డి, అయ్యవారయ్య, వీజే రావు, అశోక్, చంద్రహాస్ రెడ్డి, కేవీకే రెడ్డి, ఎస్ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యుత్ కార్మికులు

పోరుమామిళ్ల : విద్యుత్ కార్మికుల సమస్యలపై మంగళవారం ఇక్కడి సబ్‌స్టేషన్ ఆవరణలో సీఐటీయూ యూనియన్ నాయకులు, కార్మికులు పోస్టర్లు విడుదల చేశారు ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా పని చేస్తున్న 23,500 మంది కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంటుగా పని చేస్తున్న ఐటీఐ అన్‌స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ వేతనం ఇవ్వాలని కోరారు. మీటర్ బిల్ ఏజన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని చెప్పారు. అలానే రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వమే ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సమస్యలు సాధించుకునేందుకు సెప్టెంబర్ 5న తిరుపతిలో జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని విద్యుత్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ నాయకులు సురేష్, నౌషాద్, గిరి, రామిరెడ్డి, గురప్ప, రాజశేఖర్, నబీ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ


తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు


పతకాలు సాధించిన పోరుమామిళ్ల విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయనగరంలో ఈనెల 17, 18వ తేదీల్లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 40వ సీనియర్, 39వ జూనియర్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరు క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఆర్.కళాజ్యోత్స్న సీనియర్ బాలికల 67 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిందని మైస్పేస్ తైక్వాండో క్లబ్ మాస్టర్ సలీం తెలిపారు. సీనియర్ బాలుర 87 కేజీల విభాగంలో సాయికళ్యాణ్ కాంస్య పతకం, జూనియర్ 55 కేజీల విభాగంలో సాయి శ్రవణ్ రజత పతకం సాధించారని ఆయన వివరించారు. బంగారు పతకం సాధించిన కళాజ్యోత్స్న అక్టోబర్‌లో తెలంగాణ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే కళాజ్యోత్స్నను మైస్పేస్ తైక్వాండో క్లబ్ మెంటర్ బాష, కోచ్ ఇస్మాయిల్ అభినందించారు.

పోరుమామిళ్ల : ఈ నెల 17, 18 తేదీల్లో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల విద్యార్థులు ప్రతిభ చూపారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు.

జూనియర్ విభాగంలో మౌనిక, ఖాసీం, లక్ష్మీయోగి భరత్, సాయికృష్ణతేజ బంగారు పతకాలు సాధించగా, ఆశిక్, అమర్నాథ్, చరణ్‌తేజ కాంస్య పతకాలు సాధించారని ఆయన తెలిపారు. సీనియర్స్ విభాగంలో సాయిప్రీతి బంగారు పతకం, ఉస్మాన్ బాషా, కాశిబాబా రజత పతకాలు, కవిత, గురుతేజ, దిలీప్, వెంకట నారాయణ కాంస్య పతకాలు సాధించారని నాయబ్ వివరించారు. జూనియర్స్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన వారు సెప్టెంబర్ 7, 8, 9 తేదీల్లో ఆగ్రాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సీనియర్స్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన వారు అక్టోబర్‌లో తెలంగాణలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

బాలికల ఉన్నతపాఠశాలలో నీటి కొరత

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో నీటి సమస్యతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తోంది. మంగళవారం మధ్యాహ్న భోజనం అనంతరం బాలికలు దాదాపు 250 మందికి తాగునీరు, ప్లేట్లు శుభ్రం చేసుకొనేందుకు నీరు లేక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. మూడు వాటర్ ట్యాంక్‌లు ఉన్నా అందులో ఒక చుక్క నీరు నిప్పక పోవడంతో బాలికలు తిన్న ప్లేట్లు ఎండి పోయాయి. కనీసం తాగడానికి కూడా నీరు అందియక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. ట్యాంక్‌లకు నీరు నింపడంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు పడ్డామని బాలికలు తెలిపారు. మరుగుదొడ్లలో కూడా నీరులేదని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

దోమల రహిత సమాజం కోసం పాటుపడాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రీవాణి


చాపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : దోమల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని మండల వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చాపాడులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారి శ్రీవాణి మాట్లాడుతూ.. దోమల కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దీని బారి నుంచి తప్పించుకునేందుకు ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనాఫిలిస్ ఆడ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని సర్ రోనాల్డ్ రాస్ గుర్తించిన రోజును ప్రపంచ దోమల దినోత్సవంగా పాటిస్తారన్నారు. దోమ రహిత సమాజం సంపూర్ణ ఆరోగ్యానికి సోపానమని, ప్రతి ఒక్కరూ దోమల రహిత సమాజం కోసం పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.ఓబులేసు, సీహెచ్‌ఓ మహదేవయ్య, మండల ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతీ, బాబురెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, ఫార్మసీ అధికారి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

దోమల పట్ల జాగ్రత్త వహించండి

బి.కోడూరు : దోమకాటుకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్‌లు తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సర్ రొనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దోమకాటు వలన వచ్చే మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర వ్యాధుల గురించి పోరుమామిళ్ల సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి వివరించారు. దోమల లార్వా ఉత్పత్తిని ఏ విధంగా నిర్మూలించాలి అనే అంశంపై బి.కోడూరు, ఆదిత్యాంరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, స్టాఫ్‌నర్సులు విజయలక్ష్మి, సునీత, వేదవతి, ఫార్మాసిస్టు వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం మల్లిక, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఆశ కార్యకర్త వీరనారాయణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్

దువ్వూరు : దువ్వూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తనిఖీ చేశారు. కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో జేసీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మండలంలో కౌలు రైతుల కార్డులను, సర్టిఫికెట్లను జాప్యం చేయకుండా త్వరగా జారీ చేయాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారిగా ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్ భూములను ఏ రికార్డుల మేరకు, ఏ ప్రాతిపాదికన ఫ్రీ హోల్డ్ చేశారని సిబ్బందిని అడిగారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆఫీసుల చుట్టు ప్రజలను తిప్పుకోవద్దన్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధురవాణి, డిప్యూటీ తహసీల్దార్ ఆలీఖాన్, ఆర్‌ఐలు జాన్సన్, నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ నల్లేరు పోలమ్మ

కాశినాయన : అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ, జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం నరసాపురంలోని స్త్రీ శక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 23వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. ఆ గ్రామసభల్లో పంచాయతీలో చేపట్టబోయే పనుల గురించి నివేదికలు తయారు చేసుకునే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అన్నిశాఖలపై చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీడీఓ మైథిలి, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీమ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు బాలిరెడ్డి, సందీప్, పుల్లయ్యతో పాటు మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న చైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్కరికీ అవసరమని చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు పట్టణంలోని వెంకటేశ్వరపేటలో మెప్మా స్లమ్ లెవెల్ ఫెడరేషన్ మీకు తెలుసా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధుల గురించి సమాచారాన్ని అందించి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గాను ఈ నెల 12 నుంచి అక్టోబర్ 11 వరకు మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పుల్లయ్య, భాగ్య, ఉమామహేశ్వరి, సునీత పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలుప్రాంతాల్లో ఉన్న యాచకులకు చిరంజీవి అభిమానులు దుప్పట్లు పంపిణీ చేశారు. శివాలయంవీధి, టీబీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, మైదుకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లోని యాచకులు, నిరాశ్రయులకు చిరంజీవి అభిమానులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు రామారావు, షరీఫ్, చంద్రధర్, బాబురావు, మధు, చెన్నా రవి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలు నిర్వహించాలి

బ్రహ్మంగారిమఠం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉపాధి పనులు చేపట్టే గ్రామాల్లో తప్పకుండా గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉపాధి ఏపీఓ కృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 23వ తేదీన ప్రతి గ్రామ పంచాయతీలో తప్పకుండా గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజిఅసిస్టెంట్లు, ఉపాధి ఎఫ్‌ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన 117, 128 జీఓలను రద్దు చేయాలని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. టీచర్లకు నెలవారి పదోన్నతులను కల్పించాలని, ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ, ఐబీ, టోఫెల్ సిలబస్‌లను రద్దు చేయాలని పేర్కొన్నారు. టీచర్లకు బోధనేతర పనులను అప్పగించవద్దని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శులు మునివర్ధన్‌కుమార్, అప్సర్ పాషా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య, సయ్యద్ బాషా, రాజుపాళెం మండల అధ్యక్షుడు నరసింహాకుమార్, జిల్లా కౌన్సిలర్లు ఈశ్వర్‌రెడ్డి, సురేష్, బాబుల్‌రెడ్డి, అబ్దుల్ ఖాద్, విష్ణువర్ధన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

3న ఏఐటీయూసీ సభను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : విశాఖపట్నంలో సెప్టెంబర్ 3న నిర్వహించే ఏఐటీయూసీ భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి బి.రామయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధి పెన్నానగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా బ్యాంకింగ్, రైల్వే, బీఎస్ఎన్ఎల్, ట్రాన్స్‌పోర్ట్, విశాఖ ఉక్కు కర్మాగారం, పోస్టల్, మెడికల్, మున్సిపల్, కోల్, సిమెంట్, విద్యుత్, ఉపాధ్యాయ, ఆశ, అంగన్‌వాడీ, ఆటో, హమాలీ, వ్యవసాయ కార్మిక తదితర రంగాలకు చెందిన ఆయా జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కార్మికశాఖ కార్యాలయాల పునర్జీవానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు వై.హరి, ఎల్లయ్య, మచ్చా శ్రీను, కళ్యాణ్, సురేంద్ర, మీరావలి, మధు, అల్లాబకాష్, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

బద్వేలు అర్బన్ : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్లు సమర్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎస్సీ, ఎస్టీ వర్గాలు, వివిధ బహుజన సంఘాలు వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ బుధవారం నిర్వహించనున్న భారత్ బంద్‌కు సహకరించాలని మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, నియోజకవర్గ అధ్యక్షులు బత్తిన పెద్దవెంకటసుబ్బయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు, రవాణా సంస్థలు, వర్తక వ్యాపారులు ప్రతిఒక్కరూ బంద్‌కు సహకరించాలని కోరారు.